# 4. సుడి చిక్కిన పడవ

బయట వర్షం జోరుగా పడుతోంది. ఈదురగాలి వీస్తోంది. కాని, క్లబ్బు లోపలహాలులో వెచ్చగా ఉంది. సన్నటి వాయిద్యం రేడియో లోంచి వినవస్తున్నది. క్లబ్బు మెంబర్లు ఓ పాతికమంది ఉన్నారు. అతిథులు మరో పదిహేనుమంది. అందరూ ఆఫీసర్లే, సగానికి పైగా ఇంజనీర్లు.

పిచ్చాపాటీ కబుర్లు సాగినా, ప్రతీ సభ్యుడు, ఆలస్యం అవుతున్నదని వాచీ చూసుకుంటూ వ్యక్తం చేయలేని బాధను అనుభవిస్తున్నాడు. రావలసిన మనిషి అరకులోయ నుండి బయలుదేరి ఇప్పటికి అరగంట అయింది. ఏ నిమిషంలోనైనా రావచ్చునని ఎదురు చూస్తూ ఉంటే మూడగంటలు గడచిపోయాయి.

క్లబ్బు గేటు దగ్గిర జీపు ఆగింది. బంట్రోతు గొడుగుపట్టుకొని అటువేపు పరుగెత్తాడు. అప్పటికీ రామమూర్తి సూటు కొంచెం తడిసింది. అతని భార్య కట్టిన పట్టు చీర చెంగు చెమ్మదేరింది.

రామమూర్తి రాకతో హాలులోని వాళ్ళందరూ అతని గౌరవార్థం లేచి నిలబడ్డారు.

"మిత్రులు మన్నించాలి. అతిథులను క్షమించమని ప్రార్థిస్తున్నాను. సాయంకాలం అయిదుగంటలకే చేరే వాళ్ళం. తోవలో అసిస్టెంటు ఇంజనీరు ఆపడం చేత ఆలస్యమయింది. శివలింగపురం స్టేషను దగ్గిర ఒకటనెల్ ఉంది. వర్షానికి జారిపడిన బండరాళ్ళు గుహాముఖాన్ని కప్పివేశాయి. వెంటనే కంప్రెసర్లు తెప్పించి డ్రిల్లింగ్ ఆపరేషను మొదలుపెట్టాం. తరువాత బ్లాస్టింగు - ఈ కొండదారులకు తప్పవీ పనులు. అందుచేత ఆలస్యమయింది" అన్నాడు రామమూర్తి.

ఆనాటి సభకు డివిజనల్ ఇంజనీరు ప్రెసిడెంటు, రామమూర్తి ముఖ్యవక్త.

అతిథులు, మేనేజిమెంట్ ట్రయినింగ్ అవుతున్న సివిల్ ఇంజనీర్లు. ఢిల్లీ నుంచి వచ్చారు. క్రిందటి రోజే రైలులో అరకు వరకువెళ్ళి తిరిగి వచ్చారు. మరునాడు మద్రాసు వెళ్లిపోతారు.

"రామమూర్తి సీనియర్ ఇంజనీరుగా అరకులో పని చేస్తున్నారు. అతను దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు చాలక్లిష్టమయినవి. మీరుఎన్నుకున్న విషయం గురించి

చెప్పగలిగే సామర్ధ్యం ఆయన ఒక్కరికే ఉంది. ఇప్పటికే కాలాతీతమయింది. శ్రీరామమూర్తి..' ' ప్రెసిడెంటు రామమూర్తిని పరిచయం చేసి కుర్చీలో కూర్చున్నాడు.

"అతిథులకు, స్నేహితులకు నమస్కారం. మన చంద్రశేఖరరావు నా మీద నున్న అభిమానంతో నన్నీపనికి వినియోగించారు. 'యజమాని - విషమ పరిస్థితులు' - ఈ విషయం మీద మాట్లాడమని మిత్రులు కోరుతున్నారు. నేను వివరాలేవీ సేకరించలేదు. అయినాసరే ఏవో మాట్లాడమని నన్ను మీముందుంచారు. అతిథులకు ఆశాభంగం కలిగించకూడదని ఈ పనికి అంగీకరించాను."

రామమూర్తి అందరివేపు ఒకసారి చూసి, భార్యమీద ఒక క్షణం దృష్టినిలిపి, గొంతు సవరించుకున్నాడు.

రామమూర్తి మైకు దగ్గిర నిలబడి విశాలమైన ఫాలం మీద జారిపడుతున్న ఉంగరాల జుత్తును పక్కకు ఒత్తుకొని మాట్లాడడం మొదలుపెట్టాడు.

"ప్రభుత్వరంగంలోనైనా, ప్రయివేటు సంస్థలోనైనా, అధికారంలో ఉన్న వాళ్లను యజమానులుగా పరిగణించవచ్చు. ప్రభుత్వం ఆజమాయిషీ ఒక విభాగానికి అధికారిగానున్న నన్ను యజమానిగా మీరు తీసుకోవచ్చు."

చాల తేలికగా అతను తన ఉపన్యాస ధోరణికి చేరుకోడంతో హాలులో కలకలం తగ్గి సభ్యులు శ్రద్ధా బద్ధులయారు.

"ఇక పరిస్థితులు. ఇవి పని వాళ్ళకు యజమానికి సంబంధించినవి. ఎంత క్లిష్టమయినా ఇరుపక్షాలవాళ్ళు కలిసి కృషి చేస్తే సులువుగా వాటిని ఎదుర్కోవచ్చు. ఇటువంటి వర్షా రాత్రిని పరిస్థితులు విషమించాయి. అరకు నుండి ఇనుపఖనిజం తెస్తున్న రైలు ట్రైడా స్టేషను దాటింది. శివలింగపురం స్టేషను వేపు ప్రయాణం చేస్తున్నది. దారిలో ఒక ఎత్తైన వంతెన ఉంది.దానిమీద యింజను. వాగనులు పడిపోయాయి. వంతెన కూడా బాగా దెబ్బతింది. యింజనును, వాగన్లను ముందు ఎత్తివేశారు. తరువాత రైలు దారి బాగుచేసే మా పని మొదలయింది. మేము ఇరవై నాలుగు గంటలుపనిచేశాము ఆ విధంగా పని చేస్తే మరో పన్నెండు గంటల తరువాత, అంటే సాయంకాలం ఆరుగంటలకు దారి బాగుపడి రైళ్ళు నడవడానికి వీలుపడుతుంది.

"అప్పటికే నాకు అధికార్లనుండి కబర్లు మీద కబుర్లు వస్తున్నవి. వాళ్ళు నాతో మాట్లాడడానికి తొందరపడుతున్నారు. సవ్యంగా ప్లాను ప్రకారం రెండు వందల మంది అహోరాత్రులు పని చేస్తున్నారు. వాళ్ళకి భోజన సదుపాయాలు జరుగుతున్నవి. అందరూ ఉత్సాహంతో ముందు కురుకుతున్నారు. ఈ విధంగా శ్రమిస్తే బహుశా మధ్యాహ్నం రెండు గంటలకే పని పూర్తి చేయవచ్చు.

"వర్షం ఆగిపోయింది. రెయిన్ కోటు, టోపీ తీసిపారేసి ట్రాలీలో శివలింగపురం స్టేషనుకు బయలు దేరాను. స్టేషను చేరిన వెంటనే అధికారులకు పరిస్థితిని స్పష్టం చేసి సాయంకాలం ఆరుగంటలకు రైళ్ళను మామూలుగా రెండు వేపుల నుండి నడపవచ్చునని హామీ యిచ్చాను. అంత తక్కువ కాలంలో కార్యం నిర్వహించడం కష్టసాధ్యమని అధికారలందరూ మెచ్చుకున్నారు. మెప్పుకి భుజాలు పొంగని వాళ్లెవరు?"

రామమూర్తి సభ్యులందరినీ చిరునవ్వుతో చూసి, గ్లాసులోని నీళ్ళు కొద్దిగా తాగి ఉపన్యాసం సాగించాడు.

"సకాలంలో పని ముగుస్తుందన్న ఆనందంతో తిరిగి బ్రిడ్జివేపు బయలుదేరాను. అప్పటికి కొండలమీదకి సూర్యకాంతి వచ్చింది. ఆ నీరెండలో తడిసిన బండరాళ్ళు బంగారు పూతలను తొడుక్కున్నాయి దూరంలో జలపాతాలు చేస్తున్న శబ్దం లోయలో ప్రతిధ్వనిస్తున్నది. వెదురుటాకులు తమ మీదనున్న నీటి ముత్యాలుదులుపు కుంటున్నవి. పిట్ట ఎక్కడో ఉండుండి కూస్తున్నది. శ్రమ మరచిపోయి నేను ఆరాధిస్తున్న ఈ ప్రకృతి కాంత పరిష్వంగంలో..'

రామమూర్తి భార్య వేపు దృష్టి క్షణం నిలిపి ఈ అనుభూతిని వ్యక్తం చేయడంలో కనులు మూసుకున్నాడు. ఏదో తన్మయత అతనిని ఆవరించుకుంది.

ఇంతలో బేరర్లు ట్రేలతో కాఫీ కప్పులు తీసుకొని లోపలికి వచ్చారు. వాళ్ళ అడుగుల చప్పుడు హాలులోని నిశ్శబ్దాన్ని భంగం చేసింది.

"ఓ!... కాఫీ సంగతే మరచిపోయాను. క్లబ్బు కాఫీ గురించి వింటే అన్ని కౌగిళ్లు వదిలిపెట్టవలసి వస్తుంది. ఇంతవరకు పరిస్థితులు సాధారణంగానే ఉన్నవి. కాఫీ బ్రేక్ తరువాత కథ సాగించవచ్చు' అన్నాడు రామమూర్తి కళ్లు తెరచి.

మరొక పావుగంటలో ఉపన్యాసం తిరిగి ప్రారంభమయింది.

"వంతెన చేరుకునే సరికి ప్రకృతిలోని ప్రశాంతత అక్కడ కూడా అలముకుంది. పనివాళ్ళందరూ ట్రాక్ మీద పనిముట్లు పడేసి మౌనంగా కూర్చున్నారు. పని ఆగిపోయింది. ప్రకృతి పన్నిన వలలోంచి నేను బయట పడి నిజం గ్రహించేసరికి పరిస్థితులు తారుమారయాయి. దీనికి కూడా పరిష్కార మార్గం ఉంటుందని కొంతమంది అనుకోవచ్చు. పై స్టేషన్లలో ఉన్న గాంగులను తెప్పించి పని చేయించవచ్చు. కాని, ఇప్పుడు సత్యాగ్రహం చేస్తున్న వాళ్ళు అడ్డం వస్తారు. పని ఒక అంగుళం మేరకు కూడా ముందుకుసాగే అవకాశాలు సన్నగిల్లిపోయాయి. పరిస్థితులు పూర్తిగా విషమించాయి.

"దీనికి కారణం లేకపోలేదు. పని మామూలుగా ముగిస్తే ఈ సంగతి గురించి చెప్పవలసిన అవసరం లేదు. ముందు రోజే ఒక సంఘటన జరిగింది. వంతెనలు నిర్మించేటప్పుడు కేరళ నుండి మోపలా గాంగులను తెప్పించాను. వాళ్ళు సుయాసంగా ఎంత ఎత్తుమీద నయినా పని

చేయగలరు. నిర్మాణ దశలో చాలమంది మోపలాలు అందుబాటులో ఉండేవాళ్ళు. అప్పుడు సత్యనారాయణ అన్న యువకుడికి ప్రత్యేకంగా వారి క్రింద శిక్షణ ఇప్పించాను. వాళ్ళందరూ వెళ్ళిపోయిన తరువాత అతనే మాకు ఆధారమయాడు. కిందటి రోజు బ్రిడ్జి అడుగు భాగంలో పని చేస్తూ అతను కిందకు పడిపోయాడు. దానితో నాకుడి చేయి విరిగింది. అతనిని చావు బతుకులలో విశాఖపట్నం హాస్పిటలులో చేర్చి సాయంకాలం వేళకు బ్రిడ్జి దగ్గిరికి తిరిగి వచ్చాను. అతని పరిస్థితి చాల ఆందోళనకరంగా ఉంది.

"నేను పనివాళ్ళ దగ్గిర ఏ విషయం దాచలేదు. సత్యనారాయణ నాకు కుడిభుజం కావచ్చు. కాని, వాళ్ళకతడు దేవుడు. సాయంకాలం పని ముగియగానే అందరం విశాఖపట్నం హాస్పిటలుకి వెళ్ళి అతనిని చూచి వద్దామని అనుకున్నాము. అందుకోసం లారీలను కూడా ఏర్పాటు చేశాను. అన్నీ చేసినా ఈ ఆటంకమెందుకు?

"సత్యనారాయణకు ఒక అన్న ఉన్నాడు. అతని పేరు ఆనందరావు. మా గాంగ్‌లలోనే అతడు మేస్త్రీగా పని చేసేవాడు. తాగుబోతు, జూదరి, నెలకోరోజు పనికి వచ్చేవాడు. అగువులకు ధర్మాలకు అతడే మూలం, అతనికి పెళ్ళి కాలేదు. అతని తమ్ముడు సత్యనారాయణకు కిందట ఏడే పెళ్ళయింది. ఈ ఆనందరావుకి రెండునెలల కింద పని నుండి తీసివేశారు. అప్పటినుంచీ అతను పగబట్టిన త్రాచులా అవకాశం కోసం చూస్తున్నాడు.

"రెండు రోజులయి ఆనందరావు బ్రిడ్జి చుట్టు ప్రక్కలే తిరుగుతున్నాడు. నేను పొద్దున్న స్టేషనుకు వెళ్లినప్పుడు అతను వచ్చి పనివాళ్లకో వార్త చెప్పాడు. సత్యనారాయణ గతరాత్రే చచ్చిపోయాడు. ఆ విషయం నాకు తెలిసినా మభ్య పెట్టి పని చేయిస్తున్నాను. సత్యనారాయణ చనిపోకపోయే ఉండును. బ్లాస్టింగ్ చేసినప్పుడు ఒక పెద్దరాయి వచ్చి బ్రిడ్జి మీద పడింది. దాని అదుటికి అతను పట్టు తప్పి కింద పడిపోయాడు. నేనే సరియైన జాగ్రత్త తీసుకోని, సత్యనారాయణను దూరంగా పంపించి బ్లాస్టింగ్ చేయిస్తే ఈ ప్రమాదం సంభవించనే సంభవించదు.

" ఈ వార్త దావాగ్నిలా వ్యాపించింది. అమాయకులైన పనివాళ్ల చాలా సులువుగా నమ్మారు. పర్యవసానం... అనుకున్న ప్రకారం పని పూర్తి కాదు. ఏదో విధంగా తగవు పరిష్కారమయి - ఈ తగువెలా పరిష్కారమవుతుంది? పైన అధికారలందరికీ నామాట మీద అతి విశ్వాసం. ఈ రోజుతో వాళ్లకి నా మీద నున్న నమ్మకం పోతుంది. కార్యసాధనకు రామమూర్తి మారు పేరు అన్న అభిప్రాయం వారి మనస్సుల లోంచి తుడిచిపెట్టుకుపోతుంది.

"ఇంత అందమైన ప్రకృతి మాయమయి, లోకం చీకట్లు కమ్మినట్లయింది. నా ముందాలోచనలు, ఏర్పాటులు అన్నీభగ్నం చేసి ఆనందరావు విజయం సాధించాడు. తన ఉద్యోగం పోయినట్లే నా ఉద్యోయగం తీసివేయించే ప్రయత్నమే చేశాడు.

"కాని, జీవితంలో ఒక్కటే నేర్చుకున్నాను. అడుగు ముందుకు వేయడమే నాకు

తెలుసు. పరిస్థితులు విషమించిన కొద్దీనా సంకల్పం వజ్రత్వాన్ని పొందుతుంది. అనుకున్నవేళకు పని పూర్తి కావలసిందే!

"పని వాళ్లు నేను తెచ్చిన కాఫీ కూడా తాగకుండా అలా కూర్చున్నారు. వాళ్ళలో పెద్ద నాయుడని కొంచెం వయసు మళ్లిన అతనొకడున్నాడు. అతనిని పిలిచాను.

"నాయుడూ! మీరందరూ ఆనందరావు చెప్పిన మాటలు నమ్మి, సత్యనారాయణ చనిపోయాడని చెప్తున్నారు. నిన్న రాత్రి, రెండోసారి నేను హాస్పిటలుకు వెళ్లిన సంగతి మీకు తెలుసు. తిరిగి వచ్చేసరికి అర్థరాత్రి దాటి రెండు గంటలయింది. నేను హాస్పిటలు విడిచే సరికి అతను చనిపోలేదు. పొద్దున్న పై అధికారులతో మాట్లాడేటప్పుడు ముందు సత్యనారాయణ సంగతి కనుక్కొని, తరువాత పని గురించి చెప్పాను. ఏమిటి మాట్లాడానో, దగ్గిరగా ఉండి వింటున్న మీ రాజారావునే అడగండి. సత్యనారాయణను స్పెషల్ కాబిన్‌కి బదిలీ చేశారని, నెత్తురెక్కిస్తున్నారని కబురు తెలిసింది. మీకు నిజం తెలియాలి. నామాటల మీద మీకు నమ్మకం పోయింది. మీలో నలుగురు వెంటనే జీపుమీద వెళ్లి సత్యనారాయణను చూసిరండి. అతను బతికి ఉన్నట్లయితే మీరు పని చేయండి.లేకపోతే మీరేది చెప్తే దానికి నేను అంగీకరిస్తాను.

"వాళ్ళు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. నలుగురు పనివాళ్ళు ముందుకొచ్చారు. వాళ్ళకోసం జీపు సిద్ధంగా ఉంది. వాళ్ళు బయలుదేరేసరికి ఉదయం తొమ్మిది గంటలయింది. చాల వేగంగా వాళ్ళు హాస్పిటల్ చేరినా రెండు గంటలు పడుతుంది. అక్కడ కనీసపక్షం వాళ్ల ఒక అర గంట ఉన్నా తిరిగి పని చేయవలసిన స్థలం చేరడానికి మధ్యాహ్నం ఒంటిగంట దాటుతుంది. అంతవరకు పని ఆగిపోతుంది. తరువాత... వాళ్లందరూ మనసుంచి పని చేస్తే...వాళ్ల సంగతి నాకు బాగా తెలుసు... ఏదో ఆశారేఖ మళ్లీ తోచింది.

"వాళ్లెవరూ పని చేయడం లేదు. మౌనంగా కూర్చున్నారు. వాళ్లకు కొద్ది దూరంలో నేను కూర్చున్నాను. నాకు కూడా పని లేదు. ఇంతవరకు సత్యనారాయణ గురించి ఆలోచించడానికి కూడా నాకు వ్యవధి చిక్క లేదు. అతనితో నాకు పరిచయమయి అయిదు సంవత్సరాలయింది. సాహసమైన పనులకు ఇతరులు ఆలోచించే వేళల్లో అతను ముందంజ వేసేవాడు. మనిషి చాల సౌమ్యుడు. మనసు మెత్తనిది. ఎంతోకాలం అతను పెళ్ళి చేసుకోలేదు. అతని అన్న ఆనందరావుకి స్థిరత్వం లేకపోవడమే అందుకు కారణం. తెచ్చిన జీతమంతా అన్న చేతులలో పోసేవాడు. దాని ఫలితంగా హీనమైన పరిస్థితులలో దినాలు సాగించాడు. పెద్దింటి వాళ్లొకరు అతనిగుణ సంపదకు సంతోషించి పిల్లనిచ్చారు. భార్య వచ్చిన తరువాత కూడా అతనిలో చెప్పుకోదగ్గ మార్పులు రాలేదు. అన్నకివ్వవలసింది ముందే యిచ్చి పిమ్మట ఇంటి సంగతి ఆలోచించేవాడు. చాలకపోయిన మేరకు ఆమె పుట్టింటి డబ్బు సర్దుతూ ఉండేది. అతనికి మొదటి రోజులలో ఈపని ఇష్టం లేకపోయింది. కాని ఆనందరావు ఉద్యోగం పోయిన దగ్గిరనుంచీ మరేమీ అనలేకపోయేవాడు. ఆనందరావు ఉద్యోగం ఏనాడో పోయి ఉండేది.

సత్యనారాయణ మీదనున్న అభిమానం కొద్దీ నేనాపని చేయలేకపోయాను. రెండునెలల కింద అతని ఉద్యోగంపోయింది. దానికి నేనుకారణం కాను. పై అధికారులు ఇనస్పెక్షన్ చేస్తున్నప్పుడు అతను తప్ప తాగి వారిని దూషించాడు. దానితో అతని ఉద్యోగం పోయింది. నా మీద అతనికి కోపం, ఎందుకంటే నాకుగల అవకాశాలను వినియోగించి అతని ఉద్యోగం నిలబెట్టలేకపోయానని.

"సత్యనారాయణ చాల ఎత్తునుండి క్రిందకు పడిపోయాడు. దట్టమయిన పొదలలో పడ్డాడు. శరీరం చెక్కుకు పోయింది. మనిషికి తెలివి తప్పింది. బలమయిన దెబ్బలు తగలకపోడం నుంచి ప్రాణభయం లేదనుకున్నాను. జీపులో విశాఖపట్నం కింగ్‌జార్జి హాస్పిటలుకు తీసుకుపోతూ, దారిలో శృంగవరపు కోటలో ఒక డాక్టరుకి చూపించాను. అతను బాగా పరీక్షచేసి, తల వెనుక భాగానికి బలమైన దెబ్బతగిలిందన్నాడు. అప్పుడే అతను పెదవి విరిచాడు. ఎంత ఆపుకుందామనుకున్నా నాకు దుఃఖమాగలేదు. విశాఖపట్నం హాస్పిటల్‌లో అతనిని చేర్చి న్యూరోసర్జను గారిని కలిశాను. ఎటువంటి చికిత్సయినా వెనుదీయవద్దని చెప్పాను. ఆయనకూడా చాల విచారించారు. ఆపరేషను చేసి చూస్తామన్నారు. రాబోయే ఆపదను ధైర్యంతో ఎదుర్కోమన్నారు.

"అవన్నీ జ్ఞాపకం వచ్చి అప్రయత్నంగా చిన్న పిల్లడిలా ఏడుస్తూ కూర్చున్నాను. పనివాళ్ళందరూ నావేపు చూస్తున్నారు. నాకే సిగ్గనిపించింది. కళ్ళు తుడుచుకొని వాళ్ళ మధ్య కెళ్లి కూర్చున్నాను. నా దుఃఖం వాళ్లతో కలిసి పంచుకోడం కన్నా నాకు గత్యంతరం లేకపోయింది.

"మీ అందరికి సత్యనారాయణ బాగా తెలుసు. కాని అతని గురించి మీరెరుగని కొన్ని నిజాలు నాకు తెలుసు. ఒక్క సంగతి గురించి మీ అందరికీ చెప్తాను. అప్పటికి అతనికి పెళ్లయి రెండు నెలలే అయింది. మన లారీకి కావలసిన సామానుకొని తేవడానికి అతను విశాఖపట్నం వెళ్లాడు. అన్ని సామానులు దొరకలేదు. ఆ రాత్రికి అక్కడే ఉండిపోయాడు. సాధారణంగా నేను రాత్రి పూట ఆలస్యంగా నిద్రిస్తాను. ఎస్టిమేటు ఏదో చూస్తూ రాత్రి పన్నెండు గంటల వరకు నిద్రపోలేదు. బంగళా ఆవరణ గేటు తలుపులు తెరచుకొని ఎవరో వచ్చి హాలు తలుపులు తడుతున్నారు. తలుపు తీయగానే వయసులో నున్న పడుచు ఒకామె, లోపలికి వచ్చింది. వెంటనే తనే తలుపులు మూసివేసింది.

"మీరెవరు!" నేను ప్రశ్నించాను.

"బంగాళా ఎత్తున ఉందేమో, - పరుగెత్తి వచ్చినట్లుందామె - ఆమె చీర చిరిగింది, పైట స్థలం తప్పింది; వక్షం ఎగిరిపడుతున్నది. హాలులో నున్న కుర్చీ మీద ఆమె కూలబడింది.

ఆమెను అదే మొదటసారి చూడడం - ఆమె ఎవరో తెలియక పోయినా, నా సహాయం కోరి వచ్చింది. వెంటనే లోపలికి పోయి, దుప్పటీ ఒకటి తెచ్చి ఆమెకిచ్చాను. వంటినిండా ఆమె కప్పుకుంది. ఫ్లాస్కులో నున్న వేడిపాలు కప్పులో పోసి ఆమెకిచ్చాను. తరువాత కుర్చీ ఈడ్చుకొని ఆమెకు కొంచెం దూరంలో కూర్చున్నాను.

"ఇక చెప్పండి, మీరెవరో, మీకు కల్గిన ఆపద ఏమిటో?"

"నేను మీ సత్యనారాయణ గారి భార్యను'

"అర్థరాత్రి ఆవిడ రావటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

"మా ఆయన ప్రొద్దున్న విశాఖపట్నం వెళ్లిపోయారు. ఎంతరాత్రి కయినా తిరిగివస్తానన్నారు. మా బావగారికి భోజనం పెట్టి మావారి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఆఖరి బస్సుకూడా వచ్చింది. మా బావగారు వెళ్లి కబురు తీసుకొచ్చారు. వెళ్లిన పని కానట్లుంది. కాబట్టి మా ఆయన రాలేదు. ఇంట్లో ఇటూ అటూ తిరుగుతున్న బావగారు ఈ అవకాశం ఉపయోగించుకున్నారు. నేను భోజనం చేసే లోగా బైటికి వెళ్లి బాగా తాగి వచ్చారు. ఒంటరికత్తెను. ఇతరుగు పోరుగు వాళ్లందరూ తలుపులు మూసుకున్నారు. నయాన్న, భయాన్న చెప్పాను. అల్లరి పెట్టి వెంటబడుతుంటే, పరుగెత్తి కొండ ఎక్కలేక ఎక్కలేక ఇక్కడికి వచ్చాను. అతను గేటు దాకా వచ్చారు. ఇంకా అక్కడే ఉన్నారో లేక లోపలికి వస్తారో!"

"ఆమె ఏడుస్తూ చెప్పింది. ఆనందరావు సంగతి నాకు తెలుసు. తప్పతాగిన తరువాత ఒంటరిగా నున్న స్త్రీని చూసి అతను ఊరుకోలేడు. నాకు అప్పుడప్పుడు ఇటువంటి వార్తలే చేరుతుండేవి. ఏం చేయడం!

"నేను బ్రహ్మచారినే. ఒంటరివాడిని. అర్థరాత్రివేళ మరొకరి భార్యకు ఆశ్రయ మివ్వడం ఒకప్పుడు లోక విరుద్ధంగా పరిణమిస్తుంది. ఒక రాత్రి ఆమెకు రక్షణ యిచ్చినంత మాత్రాన ఈ సమస్య పరిష్కారం కాదు. దానికొకటే మార్గం తోచింది.

"బీరువా తలుపులు తెరిచి నా రివాల్వరు బయటకి తీసి ఆమె ఎదురుగా బల్లమీద పెట్టాను. ఆమెతో అన్నాను.

" మీ సమస్యకు రెండే మార్గాలు. దేనికైనా ధైర్యం చాల అవసరం. మీరు ఆడపులిలా ప్రవర్తించాలి. అప్పటికీ పరిస్థితులు విషమిస్తే అతని మీద దీనిని ఉపయోగించండి. మీ బావగారు పెద్దవాడని అతని పైన ఎదురుతిరగకపోతే, మీ ప్రాణాలు తీసుకోడానికి కూడా ఒది పనికి వస్తుంది. మీరు కాపాడుకోవలసినది మీ మానం."

"ఆవిడ నా ముఖంలోకి చాల సేపు చూసింది. బల్లమీద ఉంచిన రివాల్వరు తీసుకోలేదు.

"మీరిచ్చిన ధైర్యం నాకు చాలు. తలుచుకుంటే ఆడపులిలా ప్రవర్తించ గలను. మానం కాపాడుకోడం కోసం మా బావగారి ప్రాణాలు తీయనక్కరలేదు. నా జీవితం ముగించుకోవలసిన అవసరం కూడా లేదు."

"ఆమెకున్న లోకజ్ఞతకు ఆశ్చర్యపోయాను"

"ఆ రాత్రి ఆమె వంటరిగా వెళ్ళిపోయింది. తరువాత ఒక వారం రోజులలో బావగారిని ఇంటి నుండి బైటికి పంపించింది.

"అప్పటికిప్పుడే .. నిన్న రాత్రే తిరిగి ఆమెను చూశాను. సత్యనారాయణను హాస్పిటలులో

చేరిర్చినప్పుడు ఆమె రాలేదు. రెండవసారి వెళ్ళినపుడు ఆమె కనిపించింది. ఆమెకు ధైర్యం చెప్పే శక్తి కూడా నాకు లేకుండా పోయింది. నేను వెళ్ళక ముందు ఆనందరావు హాస్పిటలుకి వచ్చి వెళ్ళాడని ఆమె చెప్పింది.

"ఈ ఆనందరావు చివరి నిమిషం దాకా తమ్ముడిని వేధించుకొని తిన్నాడు. బ్రిడ్జి అడుగు భాగంలో పనిచేస్తుంటే, తాటి వంతెన మీద నడిచి సత్యనారాయణ దగ్గరికి వెళ్ళాడు. అంతలో బ్లాస్టింగ్ జరిగింది. తొందరగా తిరిగి వచ్చి, జేబులో నున్న డబ్బు ఒక సారి చూచుకొని, ఎవరితో మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. ఈ సంగతి మీకందరికీ తెలిసిందే!

" వాళ్ళందరూ చాల శ్రద్ధగా నేను చెప్పినది విన్నారు. ఎవరూ ఎటు వంటి వ్యాఖ్య చెయ్యలేదు. ముభావంగా కూర్చున్నారు. నేను అక్కడ నుండి లేచి వాళ్ళకు దూరంగా కూర్చున్నాను.

"పదకొండు గంటల వేళ దాటింది. ఎవరూ పచ్చి మంచి నీళ్ళయినా ముట్టలేదు. ఒకసారి ఎండ, ఒకసారి మబ్బులు, ఒకసారి వాన...... మళ్ళా వాన వెలిసింది.

"సత్యనారాయణను పని జరిగే చోటు నుంచి తిన్నగా హాస్పిటలులో చేర్చవలసి వచ్చింది. అతని భార్య అరుకు నుండి హాస్పిటల్‌కు వచ్చేసరికి బాగా ఆలస్యమయింది. అందు చేత అప్పుడామెతో మాట్లాడ లేక పోయాను. మళ్ళా రెండవసారి వెళ్ళినపుడు ఆమెను కలిశాను. తెల్లని చీర కట్టుకుంది. ధైర్యాన్ని చిక్కబట్టుకొని, ప్రమాదాన్ని ఎదుర్కొనే శక్తిని కూడగట్టుకుంటున్నది. పని జరుగుతున్న చోట ఉండలేక, హాస్పిటల్‌లో నిలువలేక నేను పడుతున్న ఆరాటాన్ని ఆమె గుర్తించింది. ఆలోచనలు సమసిపోయిన నా మనసుకి సలహా ఒకటి అందించింది.

"'బ్రిడ్జి పని పూర్తయేదాకా మా వారు జీవించి ఉండాలని మీరు కోరుతున్నారు. ఇది జనరల్ వార్డు. స్పెషల్ కాబిన్‌కి ఇతనిని బదిలీ చేయించండి. డాక్టరు గారిని నా గురించి శ్రమపడమనండి. మీకు నా మీద చాల నమ్మకం. దానిని నేను కాపాడుకుంటాను.?'"

" ఆమె మాటలు నా హృదయంలో నాటుకుపోయాయి. ఆమె సామర్థ్యాన్ని గురించి శంకించే ప్రసక్తి లేదు. డాక్టర్లకు, వార్డులోని వారికి అర్ధరాత్రి దాటిన తరువాత సత్యనారాయణ జీవించి ఉండడం అసంభవమని తెలుసు. ఆనందరావు ఆ మాట అందరి నోట విన్నాడు. ఆ రాత్రికి ఎక్కడో గడిపి తెల్లవారగానే మొదటి బస్సులో బయలు దేరి పనివారికి వార్త అందించాడు. నా మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు.

"నా మనసు దారి తప్పింది. ఆనందరావు ఆఖరి నిమిషం వరకు బ్రిడ్జి అడుగున పని చేస్తున్న సత్యనారాయణ దగ్గిర ఉన్నాడని కూడా ఆమెతో చెప్పాను. ఆమె క్షణమాలోచించింది. అప్పుడామె నాపైని నిలిపిన చూపులు నేను మరచిపోలేను. అవి నా వెన్నుతట్టి అభయమిచ్చాయి.

"పని ఆగిపోయినట్లు అధికారులకు తెలిసింది. నాకు సహాయం చేయడానికి వస్తామని కబుర్లు పంపించారు. వాళ్ల రాకతో నేను వేసిన ప్లానులన్నీ తారుమారవుతాయి. దానికి ఒకటే జవాబు .... సాయంకాలం ఆరు గంటలకు పని పూర్తి కాకపోతే ఉద్యోగానికి రాజీనామా యిచ్చి వెళ్ళిపోతానని, తరువాత వాళ్ళందరు రావచ్చునని కబురు పంపించాను.

"ఎండ నడినెత్తి నుంచి కొంచె వంగింది. శరీరాన్ని ఆకలికి, శ్రమకి నిద్రకి, అన్నింటికీ అందరాని చోట్లకు మనస్సు తిప్పుతోంది. కాలంలో ప్రతి నిమిషం మహాభారంతో ముందుకు సాగుతున్నది. ఉద్యోగ ధర్మం నిర్వర్తించడంలో ఇంత మమకారం కూడదనిపించింది. నిత్యం చేస్తున్న పనులలో ప్రమాదాలు సంభవిస్తాయి. వాటి కోసం పని వాళ్ళు సత్యాగ్రహం చేస్తే ఎలా? రైళ్ళ రాకపోకలకు వాళ్ళు ఆటంకం కలిగిస్తున్నారని చెప్తే చాలు. పోలీసులు వస్తారు. వాళ్ళను ఖైదులో పెడతారు. వారి స్థానంలో మరికొందరు కొత్తవాళ్ళను తెస్తారు. పై అధికారులు ఇటువంటి పనిని సమర్థిస్తారు. కాని కష్టంలోను, సుఖంలోను, నాతో ముందుకు నడిచి, నా మంచి పేరుకి మూలమైన ఇంత మంది అమాయకులను శిక్షించడం కన్న నా అసమర్ధతను ఒప్పుకుంటే మేలు.

"నేను ఆలోచనలో పడి ఎవరు వస్తున్నది గమనించలేదు. పని వాళ్ళందరూ లేచి ఒక్కసారి ముందుకు వెళ్ళారు. విశాఖపట్నం పంపించిన నలుగురూ తిరిగి వచ్చారు. వాళ్ళేమి చెప్పారో, వీళ్ళేమి అన్వయించు కున్నారో.... వెంటనే, ఉదాసీనంగా వెనక్కు వచ్చి, తొందరగా పనిలో సర్దుకున్నారు. పెద్ది నాయుడు నా దగ్గరికి వచ్చి "బాబుగారూ! చమించాలి. పొరబాటే జరిగింది. మీరు చెప్పినట్టు సత్తెన్నారాయణ సచ్చిపోనేదు బతికే ఉన్నాడు. అతను పడిపోడానికి కూడా మీ తప్పేం లేదు. మీరలా నిలుసుని సూత్తుండండి! సత్తెన్నారాయణ బతుక్కి, పనికి మరి సంబంధం నేదు. నాలుగో గంటయే సరికి పని అయిపోతుంది. అంత వరకు తిండి కూడా ముట్టం' అన్నాడు వినయంగా.

"పని చాల చురుకుగా సాగుతుంటే జోగారావును పిలిచాను. విశాఖ పట్నం వెళ్ళిన నలుగురిలో అతనొకడు"

" ఏమయింది జోగారావూ? "

" మీరు చెప్పినట్లే సత్యనారాయణ స్పెషలు కాబిన్‌లో ఉన్నాడు. అతని మామగారు, బావ మరుదులు, ఇంకా చాల మంది అక్కడున్నారు. లోపలికి ఎవరినీ వెళ్ళనివ్వడం లేదు. అయినా సత్యనారాయణ భార్య మమ్మల్ని లోపలికి తీసికెళ్ళింది. లోషన్ వాసన, మరేదో వాసన, అగరొత్తుల సువాసన, - అన్నీ గది నిండా అలముకున్నాయి. కట్లల్లో అతను పడి ఉన్నాడు. సత్యనారాయణ భార్య మమ్మల్ని చాల ఆదరంగా చూసింది. పని వాళ్ళందరి గురించి అడిగింది. తనే మమ్మల్ని న్యూరో సర్జన్ గారి దగ్గరికి తీసుకొని వెళ్ళింది. ఆయన చాల వివరించారు. సత్యనారాయణ వంటి మంచి వాళ్ళు బతకడం అరుదన్నారు. కొన్ని

గంటలు ప్రాణాలు నిలిచినా, అతను బతుకుతాడన్న అవకాశం మాత్రం తక్కువన్నారు. ఈ పళ్ళు, బిస్కత్తులు మా అందరికి ఆవిడే యిచ్చింది. అన్నిటి కన్న ముఖ్యంగా ఆమె చెప్పిన ఒక సంగతి మా గుండెలను చీల్చివేసింది. సత్యనారాయణకు ఒకసారి తెలివొచ్చి ఆమెతో మాట్లాడట. "అంతకన్న ఎత్తయిన చోట పని చేశాను. నా అంతట నేనెప్పుడూ పడిపోను. మా అన్న మనసులో ఏముందో, వాడే నన్ను కిందికి తోసేస్తే ఏంచేయగలను?' ఆ మాట చెప్పి ఆమె ఒకటే యేడ్చింది. మాకు అక్కడ ఒక నిమిషం కూడా ఉండాలనిపించలేదు. మాకూ బాధ్యత ఉంది. పని పూర్తి చేయడం కోసం మేము వెంటనే వచ్చివేశాము'.

"ఎవరి మాట నమ్మాలో నాకు తెలియకుండా పోయింది. బ్లాస్టింగ్ చేసినప్పుడు ఒక పెద్ద రాయి ఎగిరి బ్రిడ్జి మీద పడ్డాదని, దాని అదురుకి సత్యనారాయణ పట్టు తప్పి కింద పడిపోయాడని ఆనందరావు చెప్పాడు. అందరూ ఆ మాటే ముందు నమ్మారు. వాళ్ళందరినీ తీసుకెళ్ళి ఆ రాయి చూపించాను. అది బ్రిడ్జి మీద పడనేలేదు. బ్రిడ్జికి కొద్ది దూరంలో పడి ఉంది.

"ఇప్పుడు సత్యనారాయణ భార్య మరొక విధంగా చెప్పింది. ఆమె మాటలు అంత కన్న హెచ్చుగా నమ్మి, వాళ్ళందరూ తొందరగా పని చేస్తున్నారు. ఈ మాట ఎంతవరకూ నిజం?'
'

" అనుకున్న వేళకు పని ముగిసింది. రైళ్ళు యథాప్రకారం నడిచాయి. కాని, విజయం సాధించాననే సంతృప్తి నాకు లేకుండా పోయింది. మరెవరో నాకు దేవుడిలా అడ్డు పడకపోతే ఏంజరిగేదో!"

రామమూర్తి గబగబ గ్లాసెడు మంచి నీళ్ళు తాగాడు

"ఇంతకీ నేను మాట్లాడవలసినది మానేజిమెంటు టెక్నిక్ మీద....సారీ... మరో దారి పట్టాను..... ఇప్పుడే డిన్నరుకి చాల ఆలస్యమయింది"

రామమూర్తి ఉపన్యాసం ముగిసింది. చంద్రశేఖరరావు ముగింపు మటలు చెప్పాడు. సత్యనారాయణ భార్యకు ఉద్యోగం దొరికింది. ఈ మధ్యనే ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకుంది. ఆనందరావు ఏ అడవులు పట్టాడో....

డిన్నరయిన తరువాత ఒకరొకరే సెలవు తీసుకొని వెళ్ళిపోయారు. క్లబ్బులో అప్పుడప్పుడు వచ్చే అతిథులు రాత్రిపూట ఉండడానికో రెండు గదులున్నాయి. మరునాడు ప్రొద్దున్నే అరకు వెళ్లవలసిన దంపతులు రాత్రికి అక్కడే ఉండిపోయారు.

రామమూర్తి బట్టలు మార్చుకొని వరండాలోకి వచ్చాడు. క్రోటన్సు మొక్కలమీద చూరు నీళ్ళు ధారలుగా కారుతున్నాయి. ఇంతలో చీర మార్చుకొని అతని భార్య కూడా అక్కడికే వచ్చింది.

"ఈ వర్షం ఇంకా తగ్గలేదు" అన్నాడు రామమూర్తి.

ఆవిడ ఏదో ఆలోచిస్తోంది. ఏమీ జవాబు చెప్పలేదు

"ఏమిటాలోచిస్తున్నావు?" అతనే మళ్ళా అన్నాడు.

"బ్రిడ్జి మీద నుండి అతనెలా పడిపోయారు, మరి? ..ఈ సందేహం నన్ను విడిచిపెట్టలేదు' " అంది ఆవిడ.

రామమూర్తి బుష్ కోటు జేబులోంచి ఒక మడిచిన కాగితం తీశాడు.

"నేను మొన్న బ్రీఫ్ కేసు సర్దుతుంటే సత్యనారాయణ నోటుబుక్కు, పర్సు కనిపించాయి. అతను బ్రిడ్జి మీద నుండి కింద పడగానే, ముందు నేనే అతని దగ్గరికి వెళ్ళిన వాడిని. అప్పుడతని జేబులలో ఉన్న వన్నీ తీసి దాచేశాను, పోలీసు ఎంక్వయిరీలో ఇబ్బందులుంటాయని. ఇంత వరకు వీటిని చూసే తీరిక దొరకలేదు. ఈ ఉత్తరం నోటు బుక్కులో ఉంది. బహుశ నీ సందేహానికి దీనిలో జవాబు దొరకవచ్చు".

ఆమె తొందరగా మడత విప్పి ఉత్తరం చదవడం మొదలు పెట్టింది.

"సుశీలా!

నీతో చెప్పుకోలేని విషయం ఈ ఉత్తరంలో రాస్తున్నాను. నువ్వు నన్ను అపార్థం చేసుకోవచ్చు., నిందించవచ్చు. కాని, నేను నమ్మినది నిజమని ఈ మధ్యనే నిర్ధారణకు వచ్చాను. నువ్వు చాల అందమైన దానివి. చదువుకున్నావు. జీవితాన్ని అర్థం చేసుకున్నావు. నా అదృష్టం కొద్ది లభించావని సంతోషించాను. నీతో జీవితమొక వసంతంగా గడుస్తుందని ఆశించాను. కాని, ఏదో దుష్టగ్రహం నన్ను వెంటాడుతున్నది. మా అన్నకే ముందు మతి తప్పింది. అతని కోసమే నాలుగేళ్ళు పెళ్లి చేసుకోకుండా ఉండి పోయాను. ఎంత వద్దని అనుకున్నా, ముందుగా నాకే పెళ్ళయింది. ఒకే యింట్లో ముగ్గురం - వాడు ఒంటరిగా - కలిసి మనిద్దరం - తాగు బోతు మనసు పెడదారి పట్టిందని వాడిని నిందిస్తే ప్రయోజన మేముంది? ... తరువాత .... అంత మాట రాయలేను......రాయకుండా ఉండలేను.. ఆయన మా దొరగారు...మంచి వారు ....గుణవంతులు,......విద్యాధికులు ....అన్నిటికన్న హెచ్చుగా, స్త్రీలను ఆకర్షించే రూప సంపద గలవారు. అతనిని చూస్తే చాల మంది స్త్రీలు, లేని కోరికలకు గురవుతారు. అతని మాటలు వింటే పాదాక్రాంతులవుతారు. వాళ్ళలో నువ్వూ చేరిపోయావు. ఇలా రాస్తే నీకు చాలా కష్టంగా ఉండవచ్చు. అతనిని నేనెప్పుడూ అపార్థం చేసుకోలేను... ఒకనాడు కూడా అతను నీ సంగతి కాని, నీ సౌందర్యం గురించి కాని ఒక మాట కూడా నాతో అనలేదు. అతని హృదయం చాల లోతయినది. కాని, నువ్వు వట్టి బేలవు. అతనిని చూసి వచ్చిన తరువాత నీలో కలిగిన ఆరాటాన్ని కప్పిపుచ్చు కోలేక పోయావు. అతని పేరు విన్నా, అతని గురించి ఎవరైనా చెప్పినా, వేయి కళ్ళతో, వేయి చెవులతో నువ్వు కంపించావు. నిన్నన

వలసిన పని లేదు. నాలో కలిగిన ఈ యీర్ష్య రాజి రాజి మహాజ్వాలగా నా హృదాయాన్ని దహించ సాగింది. ఈ నిప్పు కుండను ఇంత వరకు భరించాను. మొన్న, నలుగురిలోను, నా అన్న తాగడానికి డబ్బిమ్మన్నాడు. నేను లేదన్నాను. నిన్ను దొరదగ్గరికి పంపించ మన్నాడు. ఒకనాటి రాత్రి అతనితో ఉండడానికి, మరో రాత్రి మజాగా గడిపి రాడానికి భేదం లేదన్నాడు. ఈ బతుకులో మరి తీయదనం లేదు. నలురురిలో తల యెత్తుకుతిరిగే అవకాశం లేదు. మీరు ముగ్గురూ, మూడు మహా ప్రవాహాలయి,ఈ పడవను సుడి చుట్టారు. ఈ సుడి గుండం నుంచి తప్పించుకోవాలని ప్రయత్నం చేసిన కొద్దీ లోతు తెలియని అగాధాలకు పోతున్నాను. పైకి తేలే అవకాశం లేదు. నా చావు గురించి ఎవరికీ శంక కలుగదు. ప్రమాదంలో చనిపోయాడని అనుకుంటారు. బ్రిడ్జి మీదపని చేయడానికి వెళ్ళే ముందు, ఈ నిశ్చయానికి వచ్చాను. నీకు నిజం తెలియడం కోసం ఉత్తరం రాశాను - ఎవరి నుండీ ఒక కన్నీటి చుక్క కూడా ఆశించను. మీ రెవరూ దీనికి బాధ్యులు కారు

సత్యనారాయణ నిలబడలేక పక్కనే ఉన్న కుర్చీలో కూలబడింది శ్రీమతి సుశీలా రామమూర్తి.

కింద పడిన ఉత్తరం తీసి, ముక్కలుగా చింపి, కాలువలుగా పారుతున్న వాన నీటిలో పడేశాడు రామమూర్తి.

(ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక - 1977)